క్లుప్తంగా

వేతనదారులందరికీ పని కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ సత్యం నాయుడు

వీరఘట్టం: వేతనదారులందరికీ పని కల్పించాలని ఏపీఓ జి.సత్యంనాయుడు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతీ కుటుంబానికి వంద రోజుల పనిదినాలు పూర్తి చేయించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏఎం గిరిప్రసాద్, నాయకులు జి.తిరుపాల్, ఎ.సూర్యనారాయణ, బి.రవికుమార్, ఎం.రామారావు, రాజ్ కుమార్‌లు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య

గరుగుబిల్లి: భూమి కలిగిన ప్రతీ రైతుకు ఆధార్ నంబరు తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతోందని ఏవో ఆర్.విజయ భారతి తెలిపారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. రిజిస్ట్రీ పోర్టల్ పేర్లు నమోదు చేసుకున్న తర్వాత విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుందని, ఈ నంబర్ ఉంటే ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాలను సంప్రదించి, పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.


అస్తవ్యస్తంగా కాలువలు



వీరఘట్టం ప్రధాన రహదారిలో చెత్తతో పేరుకుపోయిన మురుగు కాలువ

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారికి ఇరువైపులా ఇటీవల నిర్మించిన మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువలో చెత్తలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. సుమారు ఎనిమిది నెలలుగా ప్రధాన రహదారిలో ఉన్న కాలువల్లో మురుగు తొలగించకపోవడంతో సాయంత్రం అయ్యేసరికి దోమలు విజృంభిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ప్రధాన రహదారిలో పారిశుధ్య పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



విద్యార్థుల చదువుపై ఆరాతీస్తున్న డీఈవో తిరుపతినాయుడు

గరుగుబిల్లి: పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని డీఈవో నల్ల తిరుపతినాయుడు సూచించారు. బుధవారం మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో పదో తరగతి విద్యార్థుల ఇంటింటికీ సిబ్బందితో వెళ్లిన ఆయన.. విద్యార్థులు ఎలా చదువుతున్నారన్న విషయాన్ని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత గంటసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత మళ్లీ ఇంటి దగ్గర పిల్లలు చదివేలా చూడాలని తల్లిదండ్రులకు తెలిపారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అటు ప్రభుత్వం ఇటు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.చినశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అక్రమాలపై ఫిర్యాదు

భామిని: మండలంలోని సతివాడ సర్పంచ్ పి.రామారావు టీడీపీ కూటమి నాయకులతో కలిసి పంచాయతీ నిధులతో పాటు వివిధ అభివృద్ధి నిధులను స్వాహా చేశారని ఉప సర్పంచ్ దామోదర అప్పన్న, వార్డు సభ్యులు పి.పగడాలమ్మతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మండల అధికారులకు, పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. 2021 – 22 నుంచి తాము చేసిన పంచాయతీ పనులకు బిల్లులు ఇవ్వకుండా సర్పంచ్ స్వాహా చేశారని ఆరోపించారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏజెన్సీలో పెరిగిన జీడి విస్తీర్ణం



- జిల్లాలో 74 వేల ఎకరాల్లో సాగు
- టీ దోమతో తస్మాత్..
- సస్య రక్షణలతోనే అధిక దిగుబడులు

సీతంపేట:

గిరిజన ప్రాంతాల్లో రైతులకు ప్రధాన ఆదాయ వనరు జీడి పంటగా చెప్పొచ్చు. రోజురోజుకు జిల్లాలో జీడి విస్తీర్ణం పెరుగుతుంది. గతేడాది వరకు సరాసరి 68 వేల ఎకరాల వరకే ఉండే జీడి విస్తీర్ణం ఇప్పుడు 74 వేల 288ఎకరాల్లో సాగవుతుంది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం 6 వేల ఎకరాల వరకు జీడి సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం పూత దశలో జీడి తోటకు పలు సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖాధికారులు, శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. డిసెంబర్ నెలాఖరు నుంచి జీడిపూత మొదలై ఫిబ్రవరి వరకు పూత పూస్తుంది. అటు తర్వాత జీడిపిక్కలు తయారవుతాయి. ఈ నెలలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పూత రాలే ప్రమాదముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జీడితోటల్లో నీటి వసతి ఉన్న చోట అంతర్‌పంటలుగా కూరగాయాల పంటలు కూడా వేసుకోవచ్చు.

మండలాల వారీగా జీడి విస్తీర్ణం

మండలం	జీడి విస్తీర్ణం (ఎకరాల్లో..)
సీతంపేట	20,600
గుమ్మలక్ష్మీపురం	10,693.29
జియ్యమ్మవలస	3,493.95
కురుపాం	9,644.76
పార్వతీపురం	3,780
కొమరాడ	3,825.60
సీతానగరం	1,152.60
మక్కువ	696.80
బలిజిపేట	163.60
పాలకొండ	4,298.80
వీరఘట్టం	5,266.80
గరుగుబిల్లి	131.20
భామిని	5,958
సాలూరు	3,422.44
పాచిపెంట	1,160.19
మొత్తం	74,288.03

టీ దోమతో నష్టం

టీ దోమతో జీడి తోటలకు నష్టం వాటిల్లే ప్రమాదముందని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. పూతకాడలను, చిన్నకాయలను ఆశించి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. రసం పీల్చిన పుడు ఒక రకమైన పదార్థం వదలడం వలన కాయలు, చిగుర్లపై గజ్జిలాంటి లక్షణాలు కనిపిస్తాయి. పూత, చిగుర్లపై చేసిన రంధ్రాల వల్ల ఫ్లవర్‌బైట్ అనే తెగులు వ్యాపిస్తుంది. దోమ నివారణకు పూత మొదలై పువ్వు విచ్చుకోక ముందు ఒకసారి, పూలు ఫలదీకరణ చెందిన తర్వాత రెండోసారి టీదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు మందు పిచికారీ చేయాలి. వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడితే మంచిది.

బూడిద తెగులు నివారణా చర్యలు ఇలా...

పొడి వాతావరణం ఉన్నపుడు బూడిద తెగులు ఎక్కువగా పూతను నష్టపరిచి పూత రాలిపోయేలా చేస్తుంది. దీని నివారణకు సల్ఫర్ 3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి లేదా ట్రిడోమోర్ఫ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకులపై లేత ఆకుపచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపి మచ్చలు పెరుగుతూ చివరకు ఆకు పండి రాలిపోతుంది. పూత, పూతకాడలపై మచ్చలు ఏర్పడి పూత ఎండిపోయి రాలిపోతుంది. దీని నివారణకు రైతులు తొలుత తెగులు వ్యాపించిన కొమ్మలు తొలగించుకోవాలి. మాంకోజబ్ 1 గ్రాము మందును లీటరు నీటికి, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల లీటరు నీటికి లేదా క్లోరోతాలోనిల్ 1 మి.లీ కలిపి పిచికారీ చేసుకోవాలి.

సస్యరక్షణతో అధికదిగుబడులు



జీడిలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి పొందవచ్చు. ముఖ్యంగా వేప నూనె పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మే వరకు టీ దోమ ఉధృతి ఎక్కువగా ఉంటుంది. రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– పేడాడ జయశ్రీ, ఉద్యానవనశాఖాధికారి

మల్చింగ్ పద్ధతి పాటించాలి:



మల్చింగ్ పద్ధతిని పాటించిన నేల తేమ ఆవిరి కాకుండా కాపాడుకోవాలి. కాండం, వేరు తొలుచు పురుగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వర్షాధారపు జీడితోటలు, కొండవాలులో సాగు చేస్తున్న తోటల్లో వాలుకు అడ్డుగా చెట్టుకు పైభాగాన కందకాలను తవ్వుకుని నీరు నిలిచేటట్టు చేసుకోవాలి. నీరు నిలిచే విధంగా మొక్క చుట్టూ పాదలు వేసుకోవాలి.

– ఎస్.లక్ష్మీనారాయణ, సైంటిస్ట్, వ్యవసాయ పరిశోధనా స్థానం, సీతంపేట

గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి

గుమ్మలక్ష్మీపురం: గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు పరిశీలించి, పలు సూచనలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన 10 మంది గర్భిణులను దత్తత తీసుకుని, వారికి పౌష్టికాహార కిట్లు, వారి ఆరోగ్యం తదితర విషయాలను తరచూ పరిశీలించడం జరుగుతుందన్నారు. వైద్యాధికారులు కూడా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను దత్తత తీసుకుని, వారి ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రసవ తేదీలకు ముందుగానే గర్భిణులను వసతిగృహాలకు చేర్చాలన్నారు. అనంతరం ఫీడర్ అంబులెన్స్ సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.బుద్ధేశ్వరరావు, అభిలాష్, డీఎస్‌వో శంకర్ పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు బుధవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యం, సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన 10 మంది గిరిజన గర్భిణులను దత్తత తీసుకుని, వారికి పౌష్టికాహార కిట్లు అందజేశారు. వైద్యాధికారులు రక్తహీనతతో బాధపడే గర్భిణుల ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం



కుంబురుక దీనమయ్య



కేతిరెడ్డి అచ్చుతరావు



కోట రమేష్



ద్వారపురెడ్డి జనార్ధనరావు



ఇంటికుప్పల గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్షుల నియామకం బుధవారం జరిగింది. గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షుడిగా కుంబురుక దీనమయయ్య, గరుగుబిల్లి మండల అధ్యక్షుడిగా కేతిరెడ్డి అచ్చుతరావు, జియ్యమ్మవలస మండల అధ్యక్షుడిగా కోట రమేష్, కొమరాడ మండల అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి జనార్ధనరావు, కురుపాం మండల అధ్యక్షుడిగా ఇంటికుప్పల గౌరీశంకరరావును నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం గ్రామదేవత శ్రీపైడిమారమ్మ ఆలయ నిర్మాణానికి కురుపాం ప్రాంతానికి చెందిన కార్డియాలజిస్ట్ ఐవీ ప్రసాద్‌లాల్, లక్ష్మీలాల్ దంపతులు రూ.3.5 లక్షలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పల్ల సింహాచలంనాయుడు రూ.లక్ష, బూరుబు పైడిరాజు రూ.2 లక్షలు చొప్పున విరాళం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



విరాళం అందజేస్తున్న దాతలు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: రహదారిపై ప్రయాణం చేసే వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదరహిత ప్రయాణం సాధ్యపడుతుందని సహాయ మోటారు వెహికల్ అధికారి జి.నవీన్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా తన కార్యాలయ ప్రాంగణంలో ఆటో, వ్యాన్, క్యాబ్ తదితర వాహన యూనియన్లు, వాహన చోదకులతో ఆయన బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు నిబంధనలు వివరించారు.



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న నవీన్‌కుమార్

ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం చేయాలి

సీతానగరం: రైతుల కోసం వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ అమలులో భాగంగా బుధవారం గుచ్చిమి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుడు నిర్వహిస్తున్న ఫార్మ ర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని డీఏఓ రాబర్ట్‌పాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధి(డీఏఓ)కారి రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ 15 మండలాల్లో 25,857 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలిపారు. సీతానగరం మండలంలోని 3 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన గడువులోగా ఈ పోర్టల్‌లో రైతుల నుంచి రిజిస్ట్రేషన్స్ చేయనున్నామ ని, అధికారులు, రైతులు సహకరించి వ్యవసా సహాయకులకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అవినాష్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందిద్దాం..



విద్యుత్ శాఖ ఎంప్లాయిస్ యూనియన్ ద్వారా ప్రజలకు, సహ ఉద్యోగులకు మెరుగైన సేవలు అందిద్దామని ఆ శాఖ పాలకొండ డివిజన్ అధ్యక్షుడు టి.అచ్చంనాయుడు అన్నారు. యూనియన్ స్థాపించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా పాలకొండలోని స్థానిక కార్యాలయం వద్ద బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో జెండా ఆవిష్కరించారు. డివిజన్ కార్యదర్శి బి.జీవరత్నం, శ్రీకాకుళం ప్రాంతీయ శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.లోకేశ్వరరావు, ఎంవీ గోపాలరావు, ముఖ్య నాయకులు ఐ.తవుడు, కె.శ్రీనివాసరావు, ఎం.కేశవరావు, జి.దుర్గారావు, జి.సుధాకర్, తిరుపతిరావు, వేణుగోపాలరావు, ఉద్యోగులు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

పాలకొండ రూరల్: ఉన్నత లక్ష్యాలు సాధించే క్రమంలో పునాదిగా ఉండే పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకై విద్యార్థులు కృషి చేయాలని ఎంఈఓ కురిటి సోంబాబు అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణను బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ఇతర రంగాలకు చెందిన 15 ఉన్నత పాఠశాలల్లో బోధన పొందుతున్న 816 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం అవుతున్నారన్నారు. శతశాతం ఫలితాలు రాబట్టేలా విద్యార్థులపై వ్యక్తిగత, సబ్జెక్టుల వారీగా ప్రమాణాల మెరుగుపై హెచ్‌ఎంలు పర్యవేక్షణ చేయాలన్నారు. చినమంగళాపురం, సి.సింగుపురం, పెద కాపువీధి, జెడ్పీ బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు.

రక్తదాన శిబిరం విజయవంతం

సాలూరు: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైందని ఆర్టీసీ డీఎం భాస్కరరెడ్డి తెలిపారు. మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు చేతుల మీదుగా ప్రారంభించిన ఈ రక్తదాన శిబిరంలో 17 మంది ఉద్యోగస్తులు రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు డా.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యతా ఓటు వేయాలి

పార్వతీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పాలకపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్రా పు మహేష్ కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని చర్చివీధిలో ఉన్న పలువురు ఉపాధ్యాయులను కలిసి మద్దతు కోరారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు తిరుపతిరావు, గో పాలకృష్ణ, ఆనందగజపతి, బీవీఏ నాయుడు, రోహిణీకుమార్, అప్పలనాయుడు, స్వామినా యుడు, మంగయ్య, సంతోష్, జగదీష్, మోహ న్, జోగారావు, శ్రీను, రమణ, తిరుమల తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల మనోభావాలు దెబ్బతీసేలా స్పీకరు వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

- మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: ఏపీ శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఇదే విషయమై ఆమె మండలంలోని చినమేరంగి గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గిరిజనులకు రక్షణ కవచం లాంటి 1/70 చట్టాన్ని సవరణ చేయాలని స్పీకరు మాట్లాడడం బాధాకరమన్నారు. ఆ చట్టాన్ని సవరిస్తే గిరిజనుల భూములు గిరిజనులకు దక్కకుండా పోతాయని, ఏజెన్సీలో లభించే సహజ వనరులు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. గిరిజనుల హక్కులపై గిరిజనేతరుల పెత్తనం లేకుండా ఈ చట్టం చేయడం జరిగిందన్నారు. స్పీకరు వ్యాఖ్యలను నిరసిస్తూ మన్యం బంద్‌కు పిలుపునిస్తే అధికారులు, నాయకుల బెదిరింపులతో బంద్‌ను విరమింపజేసే ప్రయత్నానికి ఒడిగట్టారన్నారు. ఇప్పటికైనా స్పీకరు గిరిజనులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి 2002లో జీవో నంబర్ 3 రద్దు అయినట్లు ఇచ్చిన ప్రకటన అవగాహన రాహిత్యమన్నారు. 2020 జూలై 7న సుప్రీంకోర్టులో జీవో నంబర్ 3పై అప్పట్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసిందన్నారు. అదే జీవో నంబర్‌పై మరో 16 రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో వేయగా, 2024 ఏప్రిల్ 3న అన్ని రివ్యూ పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని ఈ విషయాన్ని కూటమి నాయకులు తెలుసుకోవాలన్నారు. గతంలోని తమ ప్రభుత్వం పిటిషన్లు వేయలేదని ఏజీతో చెప్పించగలరా అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేసి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీనమయ్య, మొండెంఖల్లు ఎంపీటీసీ గుడారి విద్యారాణి, కురుపాం జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎల్విన్‌పేట సర్పంచ్ చైతన్య స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

జియ్యమ్మవలస రూరల్: రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పార్వతీపురం ఎంవీఐ(మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) ఎస్.రమేష్‌కుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పెదమేరంగి కూడలిలో రోడ్డు భద్రతా నియమాలపై బుధవారం అవగాహన కల్పించారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు లైసెన్స్ సహా వాహన ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపవద్దన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కాసులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

క్రీడలతో మానసిక ఉల్లాసం

భామిని: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, స్నేహభావం పెంపొందుతుందని బత్తిలి ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, ఎస్‌ఐ డి.అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని బత్తిలిలో స్పైక్ స్టార్ వాలీబాల్ టోర్నమెంట్ అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలను వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో 40 జట్లు పాల్గొంటున్నాయని, పోటీ స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మల నిబ్బరం, రెల్లి సంఘ నాయకులు రాగోలు అశోక్, బాదాపు సుధాకర్, నిర్వాహకుడు రుంకు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ, ఎంపీటీసీ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు ఎస్.హిమప్రభ, బి.అమరవేణి కోరారు. బుధవారం ఐసీడీఎస్ పీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్లు అద్దె వెంటనే చెల్లించాలని, సెంటర్లకు ఉచిత గ్యాస్ అందించాలని, మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.శ్రీదేవి, ఎం.శ్యామల, జి.మణికుమారి, జి.జెస్సీబాయ్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మన్యం బంద్ విరమణ తాత్కాలికమే..

సీతంపేట: మన్యం బంద్ విరమణ తాత్కాలికమేనని ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం గిరిజన సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. బంద్ చేస్తున్నామనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గిరిజన చట్టాలపై సానుకూలంగా స్పందించారు తప్ప స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని గిరిజనులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. లేదంటే గిరిజనులను హేలన చేసిన స్పీకర్‌పై అట్రాసిటీ కేసు పెట్టడానికి న్యాయ నిపుణులతో చర్చించడం జరుగుతుందన్నారు. గిరిజన సంఘ నాయకులు బి.ఉమామహేశ్వరరావు, బి.అప్పారావు, ఎం.తిరుపతిరావు, ఎం.లక్ష్మణరావు, జె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు శ్రీనివాసరావు

వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు తగవు

సీతంపేట: 1/70 చట్టం సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గిరిజన సంఘాలు పిలుపు ఇచ్చిన మన్యం బంద్‌కు వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించిందని, రెచ్చగొట్టినట్టు కూటమి నేతలు ఆరోపణలు చేయడం తగదని ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హెచ్.మోహన్‌రావు తెలిపారు. ఎంపీపీ తన కార్యాలయంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. జీఓ నంబర్ 3 పునరుద్ధరించాలంటూ మా ప్రభుత్వం ఉన్నప్పుడే పోరాటం చేసిన ఘనత తమదని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా గిరిజన హక్కుల కోసం పోరాడుతుంటే లేనిపోని ఆరోపణలు చేసి రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం తగదన్నారు. గిరిజనులకు కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సిమ్మయ్య, బాపయ్య, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖర్, ఎస్.మంగయ్య, పార్టీ నాయకులు ఎస్.మహేష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ తదితరులు